క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



సాయమందిస్తున్న జానకిరావురెడ్డి

మందస: మండలంలోని పొత్తంగి పంచాయతీ రెల్లివీధికి చెందిన ఇంటిబెహర కవితనాయక్ అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె కాశీబుగ్గలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ దల్లి జానకిరావురెడ్డి శనివారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో పాటు పార్టీ నాయకుడు ఇంటిబెహర బిర్లి ఉన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ మండల కమిటీ సమావేశం

పలాస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస మండల కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు కాశీబుగ్గ ప్రగతి భవన్ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పలాస మండల కమిటీ అధ్యక్షుడు పైల చిట్టి బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి నాయకులు, కార్యకర్తలు హాజరవ్వాలని కోరారు.

శరవేగంగా వంతెన పనులు



బహుదా వంతెన వద్ద జరుగుతున్న పనులు

ఇచ్ఛాపురం రూరల్: బహుదా నదిపై కూలిన వంతెన స్థానంలో జరుగుతున్న ప్రత్యామ్నాయ వంతెన ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్ కేటాయించిన రూ.20 లక్షలతో పనులు ప్రారంభించిన సమయంలో నదిలో నీరు ఉండడంతో కొన్ని రోజులు ఆలస్యమైనప్పటికీ, ప్రస్తుతం పనులు వేగవంతంగా సాగుతున్నాయని ఆర్అండ్‌బీ జేఈ మోహనరావు తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పడితే వారం రోజుల్లో పనులు పూర్తవుతాయని స్పష్టం చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

పలాస: మండలంలోని అల్లుకోల పంచాయతీ సవర గోవిందపురం గ్రామంలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ దువ్వాడ వామాక్షి శనివారం ప్రారంభించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా విడుదల చేసిన నిధులతో అన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. పనులు త్వరితగతిన, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో దువ్వాడ రవి, పంచాయతీ రాజ్ ఏఈ పార్వతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మూర్తి, ఉప సర్పంచ్ సవర యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఉద్దానం అభివృద్ధి



కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ దానయ్య

మందస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే ఉద్దానం అభివృద్ధి చెందుతోందని ఎంపీపీ డొక్కరి దానయ్య అన్నారు. మండలంలోని రాంపురం పంచాయతీ కొత్తబిడిమిలో కాలువల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఉద్దానం నేడు అన్ని విధాలా అభ్యున్నతి చెందుతోందన్నారు. రాబోయే రోజుల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి కనిపిస్తుందన్నారు. సర్పంచ్ పొట్టి ధర్మారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి దున్న హరికృష్ణ, వైఎస్సార్ హెచ్‌యూ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ హరికృష్ణ, పంచాయతీ అధ్యక్షుడు తిమ్మల కృష్ణారావు, సీనియర్ నాయకుడు చిత్త గున్నయ్య, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా



కాశీబుగ్గ: పెద్దనారాయణపురంలో ప్రారంభమైన వరినాట్లు



ఇచ్ఛాపురం రూరల్: కాడెడ్లతో దుక్కు చేస్తున్న రైతులు



ఇచ్ఛాపురం రూరల్: వ్యవసాయ పనులకు వెళ్తున్న కూలీలు

ఇటీవల కురిసిన వర్షాలతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు, కూలీలు పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం చెరువుల్లో నీరు ఉండడంతో ఉత్సాహంగా పనులు చేస్తున్నారు. ప్రకృతి అనుకూలిస్తే ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండుతాయని అన్నదాతలు ఆశిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం రూరల్: వరినాట్లులో నిమగ్నమైన రైతులు, కూలీలు



ఇచ్ఛాపురం రూరల్: వరినారును తలపై తీసుకెళ్తున్న మహిళ

జగనన్న సురక్ష.. పేదలకు రక్ష



సోంపేట: ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు



కోటబొమ్మాళి: విశ్వనాథపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న దువ్వాడ వాణి

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకొచ్చారని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించారు. 11 రకాల సేవలను ఉచితంగా ప్రజలకు అందజేస్తున్నామన్నారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



వజ్రపుకొత్తూరు: సైనూరు ధ్రువపత్రాలు అందజేస్తున్న పాలిన శ్రీనివాసరావు తదితరులు

ఆలయానికి రూ.5 వేల విరాళం



విరాళం అందజేస్తున్న పొల్లాయి ఎర్రమ్మ

కవిటి: మండల కేంద్రం కవిటిలోని చంద్రశేఖర ఆలయ మండపం నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన పొల్లాయి ఎర్రమ్మ తనవంతుగా రూ.5 వేల విరాళాన్ని శనివారం అందించారు. ఇప్పటికే ఆలయానికి ఎండోమెంట్ విభాగం నుంచి వచ్చిన రూ.40 లక్షల నిధులతో మండపం పునర్నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. వాటితో పాటు పనులకు ఎర్రమ్మ వితరణ చేయడంపై సర్పంచ్ పూడి లక్ష్మణరావు, పి.శేఖర్, మధు, ఈశ్వర్ అభినందనలు తెలిపారు.

గుడి కట్టేందుకు సన్నాహాలు

కోటబొమ్మాళి: మండలంలో విశ్వనాథపురం గ్రామంలోని ఆకు కొండపై శుక్రవారం ఒక పుట్టలో వెలుగు చూసిన నాగదేవత, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలకు గుడి కట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా భక్తులు తండోపతండాలుగా వస్తుండడంతో ఈ ప్రాంతం సందడి కనిపిస్తోంది. ఇదే ప్రదేశంలో మరో మూడు విగ్రహాలు (శివలింగం, నంది, దుర్గాదేవి విగ్రహాలు) ఉన్నాయని ప్రచారం జరుగుతుండడంతో ఉత్కంఠ నెలకొంది. త్వరలో మంచి ముహూర్తం చూసి మళ్లీ అదే ప్రదేశంలో తవ్వకాలు చేపడతామని గ్రామంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయం పూజారి గుగ్గిలం సతీష్ శనివారం పేర్కొన్నారు. దాతలు ఆర్థిక సాయంచేస్తే ఈ ప్రదేశాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రదేశానికి రోడ్డు వేయడానికి దువ్వాడ వాణి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పరిమళించిన మానవత్వం

కవిటి: మండలంలోని రాజపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న ఆనింగి మోహనరావు ఇటీవల గుండెపోటుతో అకాలమరణం చెందడంతో వాళ్ల మిత్ర బృందం తీవ్ర వేదనకు గురయ్యింది. దీంతో ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు తమవంతుగా రూ.55,000 నగదును తమ మిత్రుడు పిల్లల పేరిట శనివారం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. దీంతో పాటు రెండు బస్తాల బియ్యం వారికి తక్షణ సాయంగా అందించారు. వారికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



బాండ్ పేపర్లు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

నందిగాం: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని కవిటి అగ్రహారంలో కాలువలు, సీసీ రహదారి పనులకు ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, స్థానిక నాయకుడు బొమ్మాళి గున్నయ్యతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటే అభివృద్ధి చేయాలనే నిశ్చయంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రోణంకి ధర్మారావు, కణితి నారాయణమూర్తి, రోణంకి బాబూరావు, తమిరె రాజు, అట్టాడ శ్రీనివాస్, పోలాకి మోహనరావు, బోరుభద్ర సోమేశ్వరరావు, కవిటి ఎర్రన్న, పాత్రుని నీలయ్య తదితరులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న పేరాడ తిలక్

‘తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు’

టెక్కలి: ప్రభుత్వం అందజేసిన జగనన్న కాలనీలపై కొంతమంది తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, నాయకులంతా జగతిమెట్ట సమీపంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి లబ్ధిదారులు మాట్లాడుతూ.. కాలనీలో ఇటీవల జనసేన కార్యకర్తల పర్యటనను తీవ్రంగా ఖండించారు. నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జన్మాంతం రుణపడి ఉంటామన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇస్తుంటే టీడీపీ, జనసేన నాయకులు వాటిని అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. మరోసారి జనసేన నాయకులు కాలనీకి వచ్చి లేనిపోని రాజకీయాలు చేయాలని చూస్తే తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. పర్యటనలో వైస్ ఎంపీపీ ఎం.కిషోర్, సర్పంచ్‌లు జి.మోహన్‌రెడ్డి, కె.కామేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.అప్పలరెడ్డి, ఎ.రాహుల్, డి.శ్రీను, ఎస్.కృష్ణ, పి.శ్రీనివాస్, డి.కామన్న, ఎన్.సోమేష్, అశోక్, శివరావ్, రాజేష్, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న లబ్ధిదారులు

త్యాగానికి ప్రతీక మొహర్రం



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఇచ్ఛాపురం: త్యాగానికి ప్రతీక మొహర్రం అని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని కంద్రవీధిలో మౌలానా పంజా, కస్పావీధిలోని పంజా వద్ద మొహర్రం పర్వదినం పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ప్రవక్త బోధనలను మత పెద్దలు షకీల్‌ఖాన్, అస్రామ్ ఖాన్‌లు వినిపించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

టెక్కలి రూరల్: నౌపడ మండలం మూలపేట గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఐ.కిషోర్ వర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు శనివారం రాత్రి సిబ్బందితో వెళ్లి ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులో తీసుకొని, వారి వద్ద నుంచి రూ.14,200 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

టెక్కలి: పట్టణంలో విద్యుత్ సరఫరాకు ఆదివారం అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ వీపీ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ 2, 4, 5 ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. అంబేడ్కర్ జంక్షన్, చేరీవీధి, సుదర్శన్ థియేటర్ ప్రాంతం, తెలుగు బ్రాహ్మణవీధి, కంద్రవీధి, అయ్యప్పనగర్, బీసీ కాలనీ, బన్నువాడ రోడ్ ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

డొంకూరులో ఉచిత వైద్య శిబిరం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని డొంకూరు మత్స్యకార గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో జనరల్, ఆర్థోపెడిక్ వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. రోగులకు ఉచిత రక్త పరీక్షలతో పాటు బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మేనేజింగ్ డైరెక్టర్ ఎం.చిన్నారావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడ్డ కల్యాణ్, పీఆర్వోలు నర్తు సంతోష్, జి.గోపి తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి 10వ వార్డులో శనివారం శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ శర్వాణ గీత, వార్డు ఇన్‌చార్జి శర్వాణ రవి ఆధ్వర్యంలో కాలువలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీ వాసులు, యువత తదితరులు పాల్గొన్నారు.

‘సిబ్బంది అప్‌డేట్‌గా ఉండాలి’



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి: మారుతున్న ప్రథమ చికిత్సకు అనుగుణంగా 108 సేవలపై ఆయా సిబ్బంది అప్‌డేట్‌గా ఉండాలని జిల్లా మేనేజర్ నజీర్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని 108 సిబ్బందికి టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శిక్షణా తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల ఆరోగ్య సమస్యలపై ఏవిధంగా అప్రమత్తంగా ఉండాలి, సీపీఆర్ విధానం, ట్రోమా ఎమర్జెన్సీ, ఎయిర్ వే మేనేజ్‌మెంట్, 108 వాహనంలో ఉండే పరికరాల వినియోగం, మందుల వినియోగం తదితర వాటిపై ఓఈ రంగప్రసాద్, ఓజేటీ ఎన్.కృష్ణ తదితరులు అవగాహన కల్పించారు.

• సేవ్ మణిపూర్



మణిపూర్ ఘటన అమానవీయమని, ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మౌనం వీడాలని కోరుతూ బలగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెక్కలిలోని వైఎస్సార్ జంక్షన్ వద్ద విద్యార్థులు శనివారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలగ ఫౌండేషన్ అధినేత బలగ ప్రకాశ్ మాట్లాడుతూ.. మణిపూర్ ప్రాంతంలో మెయితీ, కుకీ, నాగ కులాలపై విషం చిమ్మడం దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. – టెక్కలి

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ..

- పిరియా సాయిరాజ్
- సోంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న పిరియా సాయిరాజ్

సోంపేట: ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. సోంపేట సచివాలయం–1 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్ రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, సోంపేట సర్పంచ్ నగిరి ప్రభావతి, ఉప సర్పంచ్ ఎం.వెంకటరమణ, సుంకిడి సర్పంచ్ ఎస్.భాస్కరరావు, ఎంపీటీసీలు పొడుగు కామేష్, ధర్మారావు, నాయకులు నెహ్రూ, ధర్మారావు, వెంకటన్న, భీమారావు, డి.శ్రీను, ఈపరి రవి తదితరులు పాల్గొన్నారు.

మేలు చేసిన ప్రభుత్వానికి అండగా ఉండండి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న దువ్వాడ వాణి

నందిగాం: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ మేలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలకు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దబాణాపురం పంచాయతీ పెద్దినాయుడుపేట, పాత్రునివలస గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పేదలకు మేలు చేస్తున్న ప్రభుత్వంపై పచ్చ మీడియా సాయంతో టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం స్థానికుల సమస్యలు తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సంపతిరావు రాఘవరావు, దువ్వాడ హైందవి, నాయకులు పైల రమేష్‌నాయుడు, రోణంకి ధర్మారావు, బాబూరావు, కింతల ధర్మారావు, జేసీఎస్ కన్వీనర్ జడ్యాడ జయరాం, కణితి నారాయణమూర్తి, పోలాకి మోహనరావు, కోనారి రామారావు, కూన శాంతారావు, సైలాడ లావన్న, పైల కరుణాకర్, పైల ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.